ఆర్‌ఎంపీ, పీయంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ జారీ చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రంలో ఆర్ఎంపీ., పీ.యం.పీ. లకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ జారీ చేయాలని తెలంగాణ ఆర్ఎంపీ., పీ.యం.పీ రాష్ట్ర ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కోదండరామ్‌కు, విజ్ఞానదర్శిని రమేష్, శంకర్ ముదిరాజ్, పిఎంపి రాష్ట్ర నాయకులు పులగం మోహన్, బాల బ్రహ్మచారి, వెంకట్ రెడ్డి, హుస్సేన్ లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ను క్యాంప్ ఆఫీస్ నందు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్ఆర్.. జీఓ నెంబర్ 1273 ద్వారా 4.32 కోట్ల నిధులు మంజూరు చేసి వివిధ సెంటర్ల ద్వారా 12,900 మంది ఆర్ఎంపీ., పీయంపీ లకు శిక్షణ పూర్తి చేసి పరీక్షలు నిర్వహించినా సర్టిఫికెట్స్ ఇవ్వలేదని తెలిపారు. అందుకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్స్ ఇవ్వవలసిందిగా కోరారు. శిక్షణ మధ్యలో నిలిపివేయడంతో మధ్యలో శిక్షణ ఆగిపోయిన వారికి, డిడి లు కట్టి శిక్షణ మొదలుకాని వారికి, అండర్ ఏజీ పేరుతో శిక్షణ ఇవ్వని వారికి, ఇప్పటి వరకు వైద్య వృత్తిలో ఉన్న ఆర్ఎంపీ., పీ.యం.పీ. లు అందరికీ గత దశాబ్దాల కాలంగా అమలు జరగనందున 25 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయసు వారి అందరికీ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్స్ ఇవ్వాలని కోరారు.

పారదర్శకంగా పదోన్నతులు


- డీఈవోను అభినందించిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలుగు, హిందీ, ఉర్దూ పండితుల పదోన్నతులు లోపాలు లేకుండా పారదర్శకంగా నిర్వహించారని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు జమిలుల్లా తెలిపారు. మంగళవారం డీఈవోను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా అప్‌గ్రేడ్ అయినా పోస్టులకు క్యాడర్ స్ట్రెంత్ ప్రొసీడింగ్ త్వరగా ఇచ్చి సప్లమెంటరీ వేతనాలు చేసుకునే విధంగా ప్రొసీడింగ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.వి రమణాచారి, శ్రీమన్నారాయణ చారి, ప్రభాకర్, తదితర పండితులు పాల్గొన్నారు.

గతేదాది పెద్దవాగు పరవళ్లు

ఈసారి వరద లేక బోసిపోయిన పెద్దవాగు



పారని వాగు.. ఆగిన సాగు

- నాడు జలకళ.. నేడు వెలవెల
- పెద్దవాగు పైనే ఆశలు
- వరినట్లు వేయడానికి ముందుకు రాని రైతులు
- వాగు ఆయకట్టు కింద 30 వేల ఎకరాలు

నవతెలంగాణ-లింగంపేట్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు వారాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఆశించిన స్థాయి వర్షాలు కురువకపోవడంతో లింగంపేట్‌లోని పెద్ద వాగులో నీళ్ల లేక రాళ్లతో వెలవెలబోతోంది. పెద్దవాగుకు నీరు రాకపోవడంతో ఆయకట్టు రైతులు వారి నాట్లు వేయడానికి ముందుకు రావడం లేదు. పెద్ద వాగు నిండితేనే వరి నాట్లు వేస్తామని నిండక పోతే వరి నాట్లు వేయమని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వాగుపై రైతులు ఆశలు పెట్టుకున్న వారి ఆశలు నిరాశలయ్యే అవకాశాలు నిండుగా అనిపిస్తున్నాయి.

గాంధారి మండలం నుండి ప్రారంభమయ్యే పెద్ద వాగు లింగంపేట్, నాగిరెడ్డిపేట్ మండలాలకు వరప్రదాయిని. పెద్ద వాగు ప్రవహిస్తేనే పోచారం ప్రాజెక్టులోకి నీరు చేరుకుంటాయి. భారీ వర్షాలు కురవకపోవడంతో పెద్ద వాగులో నీళ్ల లేవు. పోచారం ప్రాజెక్టు సైతం నీళ్లు లేక వేలవేలబోతుంది. పెద్ద వాగులో నీరు ప్రవహిస్తే రైతులు లిఫ్ట్ ద్వారా వరి పంటలను సాగు చేసుకుంటారు. రెండు పంటలకు పెద్ద వాగు నీళ్ల సాగుకు ఉపయోగపడతాయి. పెద్ద వాగు నీటిపై 30 వేల ఎకరాలపైగా రైతులు వరి పంటను సాగు చేస్తారు.

గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో జూన్ రెండవ వారంలోని వర్షాలు కురవడంతో పెద్దవాగు ప్రవహించింది. ఈ సంవత్సరం జూన్ మాసం పూర్తయిన జులై మాసం ప్రారంభమైనా భారీ వర్షాలు కురవకపోవడంతో పెద్దవాగులో నీటి చుక్క జాడ లేకుండా పోయింది. నాడు జలకళతో ప్రవహించిన పెద్దవాబు నేడు నీళ్ల లేక ఎడారిగా మారి వెలవెలబోతోంది. దానినీటిపై ఆధారపడి సాగు చేపట్టే రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వరి నాట్లు వేయడానికి ముందుకు రాని రైతులు

పెద్దవాగులో నీళ్ల లేకపోవడంతో వాగు ప్రవహించకపోవడంతో ఆయకట్టు రైతులు వారినాట్లు వేయడానికి ముందుకు రావడం లేదు. దుక్కులు దున్ని మరి నారుమల్లు వేసినా నీళ్ల లేకపోవడంతో రైతులు వరి నాట్లు వేయడానికి ముందుకు రావడం లేదు.

పెద్ద వాగు నీటితో చెరువులు కుంటలు నింపుతుంది. గాంధారి మండలం నుండి ప్రారంభమయ్యే పెద్దవాగు రామలక్ష్మిపల్లి, బ్రాహ్మణపల్లి, పెట్ సంఘం, లింగంపేట్ మండలంలోని కోర్పాల్ నాగారం నల్లమడుగు శెట్టిపల్లి రాంపల్లి ఐలాపూర్ కన్నాపూర్ పర్మల్ల శెట్టిపల్లి సంగారెడ్డి పోల్కంపేట్ తో పాటు మెదక్ జిల్లా ఘన్పూర్ మండలంలోని కొత్తపల్లి రాజీపేట్ గ్రామాలకు చెందిన రైతులు 30 వేల ఎకరాలకు పైగా వారి పంటను పెద్ద వాగు ఆధారంగానే పంటలు సాగు చేస్తారు. అంతేకాకుండా కొంతమంది పెద్ద వాగులో నీళ్ల ఉంటేనే భూగర్భ జలాలు పెరిగి బోర్లు పుష్కలంగా నీళ్ల పోస్తూ ఉండేది. ప్రస్తుతం బోర్లు నామమాత్రంగా నీళ్ల పోస్తున్నాయి. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి దుక్కులు దున్ని ఎరువులు విత్తనాల చల్లినా వారి నారు మల్లు వేసినా ఫలితం లేకుండా పోయింది.

లింగంపేట్ మండలం లో పెద్దవాగు ప్రవహిస్తే మత్తడి కాలువ ద్వారా ఐలాపూర్ ఊర చెరువు లింగంపేట్ చీర పేర్లకుంట లింగంపేట్ ఊర చెరువు చెరువుల నింపి ఆయకట్టు సాగుకు సాగునీరు అందిస్తుంది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. రైతుల ఆశలు అడియాశలు అవుతున్నాయి.

ఆగొస్తేనే సాగు



సిద్ధ రాములు. రైతు. పర్మళ్ల

పెద్ద వాగు సమీపంలో పది ఎకరాల భూమి ఉంది. దుక్కులు దున్ని తుకం వేశాం. ఎరువులు కొనుగోలు చేసిన ఇప్పటివరకు వాగు రాలేదు. వాగులో నీళ్ల లేవు. వాగు వస్తేనే నాట్లు వేస్తాము. వర్షాల కోసం ఎదురు చూస్తున్నామన్నారు.

ఇప్పటికే నాట్లయితుండే



నాగరాజు. రైతు. పోల్కంపేట్

పోయిన సంవత్సరం ఈ పాటికే ఆగు పక్కన నాట్లు వేశాం. మూడున్నర ఎకరాల భూమి ఉంది. ఈ సంవత్సరం వాగు రాకపోవడంతో నాటు వేయలేదు. బోర్లు సరిగా పోస్తలేవు. ఆగు నీళ్లపై ఆధారపడ్డమన్నారు.

గత సంవత్సరం ఈపాటికి వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురవక చెరువులు నిండక బోరు బవుల్లో. నీళ పూర్త స్థాయిలో లేకపోవడంతో వరి నాట్లు వేయడానికి రైతులు ముందుకు రావడం లేదు. అదే విధంగా పోచారం ప్రాజెక్టుకు ప్రధాన గుండెకాయ అయినా పెద్ద వాగు ప్రవహిస్తేనే పోచారం నిండుకుండ లాగా మారుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పోచారం ప్రాజెక్టు నీళ్ల లేక వేలవేలబోతుంది. పోచారం ప్రాజెక్టు నిండితే నాగిరెడ్డిపేట్ ఎల్లారెడ్డి మండలాలకు కాలువల ద్వారా 30 వేల ఎకరాలపైగా సాగునీరు అందించవచ్చు అంతేకాకుండా చెరువులు కుంటలు నింపవచ్చు. ప్రస్తుతం వర్షాలు కురువకపోవడంతో లింగంపేట్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాలు కురిస్తే తప్ప మరి నాట్లు వేసే ప్రసక్తే లేదని రైతులు చెబుతున్నారు. వర్షం పైన రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. భారీ వర్షాలు ఎగువ ప్రాంతాలలో కురిస్తే తప్ప పెద్దవాగులు జలకళ వచ్చే అవకాశాలు లేవని, ఈసారి సాగు ఆలస్యమవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రేపు విద్యాసంస్థల బంద్

- జయప్రదం చేయండి : విద్యార్థి సంఘాల పిలుపు



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు రేపు(గురువారం) విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. 4వ తేదీనా జరిగే కేజీ టు పీజీ వరకు విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని ఎస్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఏఐపిఎస్‌యూ ప్రతినిధులు కోరారు. జిల్లా కేంద్రంలో కోటగల్లి నీలం రామచంద్రయ్య భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేష్ మాట్లాడుతూ లక్షల రూపాయలకు నీట్ పరీక్ష పత్రాలు లీకేజి చేసి 24 లక్షల మంది జీవితాలతో ఎన్‌టీఏ ఏజెన్సీ చెలగాటం ఆడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ లీకేజీపై దేశవ్యాప్త ఆందోళనలు జరిగినా దేశ ప్రధాని ఇప్పటి వరకు స్పందించలేదని, బీజేపీ హయాంలో పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో స్పష్టంగా కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుందని అన్నారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మానిటరింగ్ చేయడంలో విఫలం చెందిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు, విద్యార్థులకు సమాధానం చెప్పాలన్నారు. నీట్ నిర్వహణంలో వివాదాలు నిత్యం జరుగుతున్న నేపథ్యంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యార్థులు కోరుతున్నట్లు నీట్ పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని కోచింగ్ సెంటర్లు పేరుతో, కన్సల్టెన్సీల పేరుతో పెపర్ లికేజీలు చేస్తున్న నీట్ కోచింగ్ సెంటర్ల అమనుమతులు రద్దు చేసి పేపర్ లీకేజీ కి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జులై 4 న జరిగే దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేట్ యాజమాన్యాలు , విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మహేష్ , ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం , పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు నరేందర్, డా.గణేష్ , ఏఐపీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ అనిల్ , పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రిన్స్, విద్యార్థి సంఘల నాయకులు గణేష్,అశుర్, నిఖిల్ , తదితదిరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులలో అక్రమాలు : డీటీఎఫ్ ఆరోపణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులలో (స్కూల్ అసిస్టెంట్) జరిగిన అవినీతి , అక్రమాలు జరిగాయని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఆరోపించారు. ఈ విషయమై డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏం. సోమయ్య ,టి. లింగారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. శంతన్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం బాలయ్య, కె. ఒమాజీ మంగళవారం హైదరాబాదులో కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (పాఠశాల విద్య) దేవసేనని కలిసి ఫిర్యాదు చేశారు.

బాన్సువాడలో గంజాయి పట్టివేత



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

బాన్సువాడ పట్టణ శివారు ప్రాంతంలో అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారని డిఎస్పీ సత్యనారాయణ, సిఐ కృష్ణ సోమవారం తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు బాన్సువాడ సీఐ కృష్ణ పట్టణంలోని కొయ్యగుట్టలో పిఆర్ గార్డెన్ వెనుక వైపు సీమల శ్రీకాంత్ అనే యువకుడిని అదుపులోకి తీసుకొని, తనిఖీ చేయగా అతని వద్ద 120 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే అతన్ని పూర్తిస్థాయిలో విచారించగా బోధన్ పట్టణంలోని రాకాసి పేటకు చెందిన నస్రిన్ బేగం అలియాస్ సుమేరా భాను అనే మహిళ దగ్గర తాను గంజాయిని కొనుగోలు చేసినట్టు అతడు అంగీకరించాడు. వెంటనే బాన్సువాడ పోలీసులు బోధన్ పట్టణంలోని ఆమె ఇంటికి చేరుకొని, ఇంట్లో తనిఖీలు నిర్వహించగా, ఆమె వద్ద 500 గ్రాముల గంజాయి లభ్యమైంది. వెంటనే ఆమెతో పాటు ఆమె మామ ఎమ్‌డి రషీద్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. మహారాష్ట్రలోని నాయగావ్ అనే ప్రాంతం నుంచి తాను గంజాయిని కొనుక్కొచ్చినట్టు రషీద్ అంగీకరించాడు. దీంతో శ్రీకాంత్, నస్రిన్ బేగం, రసిద్‌లను సోమవారం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్టు డిఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా డ్రగ్స్, గంజాయి లాంటి ఇతర మత్తు పదార్థాలను అక్రమంగా విక్రయించిన, రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి కేసును చాకచక్యంగా పరిశోధించి, నిందితులను అరెస్టు అయ్యేలా కృషిచేసిన పోలీస్ సిబ్బందికి అభినందించారు.

ఎస్జీటీలు బదిలీ అయితే రిలీవ్ చేయాలి

టీడీఎఫ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉన్నత పాఠశాలలో ఎస్జిటిలకు బదిలీ అయితే తప్పనిసరిగా విడుదల చేయాలి సబ్‌స్టిట్యూట్‌తో సంబంధం లేకుండా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యా యులు రిలీవ్ చేయాలని ఆదేశాలు డైరెక్టర్ కార్యాలయం నుండి ఉన్నాయని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. రిలీవ్ ఆదేశాలు డైరెక్టర్ కార్యాలయం నుండి ఉన్నప్పటికీ కొంత మంది హెడ్మాస్టర్లు సబ్సిట్యూట్ లేరనే కారణంగా రిలీవ్ చేయకుండా స్వతహాగా నిర్ణయం తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ విషయంలో అవసరమైతే జిల్లా విద్యాశాఖను సంప్రదించి స్పష్టత తీసుకోవాలని, ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో అమల్లో ఉన్నట్టు తెలిపారు.

నామమాత్రపు మద్దతు ధర సిగ్గుచేటు

- సాగు ఖర్చు 20 శాతం పెరిగితే.. మద్దతు ధర మాత్రం 7 శాతం పెంచడం సరికాదు
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర ప్రభుత్వం రైతులకు కంటి తుడుపు చర్యగా నామమాత్రపు మద్దతు ధరలను ప్రకటించడం సిగ్గుచేటు అని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. మంగళవారం తహసిల్దార్ ఆఫీస్ డిప్యూటీ ఎమ్మార్వోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జూన్ 19న 14 పంటలకు మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రకటించింది. గత ఏడాది నిర్ణయించిన ధరలపై ఐదు నుంచి ఏడు శాతం మాత్రమే పెంచారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు 20 నుంచి 22 శాతం పెరిగాయి. ఖర్చులను తగ్గించి చూపి దానికి 50 శాతం కలిపి ధరలు ప్రకటించాలని ధరల నిర్ణయక కమిషన్ రికమండేషన్లు ప్రధాని నేతృత్వంలోని క్యాబినెట్ పరిగణ లోకి తీసుకొని లేదు. పక్కన ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, కేరళ, తరలహాలో రాష్ట్రంలో ధరలు నిర్ణయిక కమీషన్ సీఏ సీపీ వేసి రాష్ట్రంలో పండే అన్ని పంటలకు మద్దతు ధరలను నిర్ణయించి అమలు చేయాలని స్వామినాథన్ కమిటీ సిఫారసు లను అమలు చేయాలని సీ2వో 50 శాతంపై రైతుల కు మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందరికీ వాన కాలం పంట సం బంధించి యూరియా ఎరువులు అన్ని అందుబాటులో ఉంచాలని ముందస్తు ప్రణాళిక ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోగటి భువనేశ్వర్, జిల్లా నాయకులు చల్ల గణేష్, గంగారం, నవీన్ భాయ్, జయ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎస్ నాయకులు, రైతులు

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణం లోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఆకస్మి కంగా సందర్శిం చారు. పిల్లలకు సరైన మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదనీ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజువారీగా ఒకటే రకమైన కూరలు, స్నాక్స్ పెడుతున్నట్టు ఆమె దృష్టికి రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం సరిగా లేవని పిల్లలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు మూడు గంటలకు సమయం కేటాయించి అక్కడ ఉన్న స్థితిగతులను పరిశీలించారు. ప్రిన్సిపల్‌కు ఫోన్ చేయగా దీని మీద చర్యలు తీసుకుంటానని తెలిపారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. భోజనం సరిగా పెట్టడం లేదని, కలెక్టర్‌కు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఆమె వెంట కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు, పాత శివ కృష్ణమూర్తి, అన్వర్ అహ్మద్, మిర్జా ఆఫీస్ బేగ్, అంజల్ రెడ్డి, ప్రసన్న, తేజపు ప్రసాద్, మహమ్మద్ అంజద్ తదితరులున్నారు.



విద్యార్థినిలతో కలిసి భోజనం చేస్తున్న ఇందుప్రియ

మంత్రిపదవి కోసం పార్టీ మారలే

- నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం
- కాంగ్రెస్‌లో అందరినీ కలుపుకొని పోతాను
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- మాజీ స్పీకర్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు కాసుల బాల్‌రాజ్
- నాన్‌లోకల్ దుష్టశక్తుల నుంచి పార్టీని కాపాడుకుంటామని వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

'మంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరలేదు. అలాంటి ఉద్దేశ్యం, ఆలోచన కూడా లేదు. ఉన్నత పదవులు నాకు కొత్త కాదు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధే నాకు ముఖ్యం. కాంగ్రెస్ పార్టీలో అందరిని కలుపుకుని పోతాను. ఏకపక్ష నిర్ణయాలు ఉండవు. అందరిని కడుపులో పెట్టుకుని చూసుకుంటాను. నియోజకవర్గం అభివృద్ధికి మీ అందరి సహకారం కావాలి. నా రాజకీయ జీవితం ముగిసేలోగా బాన్సువాడ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చడమే నా ఆశయ'మని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోచారం శ్రీనివాసరెడ్డిని మంగళవారం బాన్సువాడ పట్టణంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసుల బాల్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.



పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న కాసుల బాలరాజ్

అనంతరం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమావేశంలో పోచారం మాట్లాడారు. '1977లో నా రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతోనే ప్రారంభించాను. తదుపరి టీడీపి, టీఆర్‌యస్ లలో పనిచేశాను. నా రాజకీయ ప్రస్థానం ఏ పార్టీతో మొదలైందో తిరిగి అక్కడికే వచ్చాను. ఏ పార్టీలో ఉన్నా నిజాయితీ, నిబద్ధత చాలా ముఖ్యం. ఏం చెప్పుతామో అదే చేయాలి. ఏ రంగంలో అయినా క్రమశిక్షణ చాలా ముఖ్యం' అని అన్నారు.

లోకల్.. లోకలే

'కాసుల బాలరాజు ఏ పనిచేసినా మడమ తిప్పడు. ఆయన పనితీరును గమనించిన రాష్ట్ర నాయకత్వం బాలరాజుకు రాష్ట్ర స్థాయి ఉన్నత పదవిని ఇవ్వబోతుంది. బాలరాజుకు రాష్ట్ర స్థాయి పదవి రావడం పట్ల మనమంతా సంతోషించాలి. టీడీపీలో నేను కాసుల బాలరాజు ఇద్దరం కలిసి పనిచేశాం. ఇద్దరం అత్యంత సన్నిహితంగా ఉండేవారం. రాజకీయంగా విడిపోయి నా మా ఇద్దరి మధ్య వ్యక్తిగతంగా ఎలాంటి వైరం లేదు. రాజకీయాలలో విమర్శలు సహజం, కానీ వ్యక్తిగతంగా ఎలాంటి శత్రుత్వం ఉండకూడదు. ఎప్పుడైనా లోకల్ లోకలే. బయట నుండి వచ్చిన వాళ్ళు అద్దెకు ఉండేవారు మాత్రమే. బాలరాజుకు కార్పొరేషన్ చైర్మన్ పదవి వస్తే వాళ్ళకు కడుపు నొప్పి ఎందుకు ? బాన్సువాడ నియోజకవర్గంలో గత ఇరవై ఏళ్లుగా కాంగ్రెస్ జెండా మోసింది కాసుల బాలరాజు. అలాంటి వ్యక్తికి ఉన్నత పదవి వస్తే సంతోషించాలి తప్ప అడ్డం పడకూడదు. నాకు బయటకు ఒకటి, లోపల ఒకటి ఉండదు. మొదటినుంచి కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన నాయకులను, కార్యకర్తలను గౌరవించాలని మా వాళ్ళకు అందరికీ సూచించాను'. 'ఇకనుండి పాత, కొత్త అని తేడా లేకుండా అందరం ఒక్కతాటిపై కలిసి నడవాలని' సూచించారు.



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

దుష్టశక్తుల నుంచి కాంగ్రెస్‌ను కాపాడుతాం : కాసుల బాల్‌రాజు

ఈ సందర్భంగా కాసుల బాలరాజు మాట్లాడుతూ పోచారం శ్రీనివాస్‌ది పెద్ద మనస్సు, మంచి వ్యక్తిత్వం కలిగిన మనిషి అని అన్నారు. ఆయన మనస్తత్వం తనకు బాగా తెలుసు, మాట గట్టిగా ఉన్నా మనసు మెత్తనిది అని అడిగితే కాదనడు అని అన్నారు. 'ఆయనను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాకు ఫోన్ చేసి అభిప్రాయం అడిగారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నది. పోచారం గారు వస్తే అత్యంత బలంగా మారుతుందని చెప్పాను. పోచారం శీనన్న వస్తే నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. గతంలో కూడా నేను శీనన్నతో కలిసి పనిచేసాను, ఇప్పుడు కూడా కలిసి బ్రహ్మాండంగా పనిచేస్తానని చెప్పాను. పోచారం శీనన్నతో, ఆయన కొడుకుతోను కలిసి పని చేయడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పాను. నాకు పార్టీ ముఖ్యం. కొంతమంది దుష్ట శక్తుల నుండి పార్టీని కాపాడుకోవాలంటే పోచారం కాంగ్రెస్ పార్టీలోకి రావాల్సిన అవసరం ఉన్నది. నేను గతంలో ప్రతిపక్ష పార్టీ నాయకునిగా పోచారంపై రాజకీయంగా పోరాడాను తప్ప నాకు ఆయనతో వ్యక్తిగతంగా ఎలాంటి శత్రుత్వం లేదు. నేను పార్టీకి కట్టుబడి పనిచేసే వ్యక్తిని. గ్రామాలలో ఏ అవసరం వచ్చినా, సమస్య ఉన్నా మీరు శీనన్నను అయినా నన్ను అయినా నేరుగా సంప్రదించండి. అందరికీ న్యాయం జరుగుతుంది. శీనన్న నాయకత్వంలో బాన్సువాడ నియోజకవర్గం బాగా అభివృద్ధి చెందుతుందని' అన్నారు.

ఆదర్శ పాఠశాల, కళాశాలలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్ నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి మంగళవారం తెలిపారు. 6 వ తరగతి నుండి 10 వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన కొన్ని సీట్లకు గురువారం 04/07/2024 నాడు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించబడునని ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి తెలిపారు. కావున ఆసక్తి గల విద్యార్థులు టిసి, బోనఫైడ్, ఆధార్, ఫొటోలతో గురువారం 10 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఆర్మూర్, ఇతర ప్రాంతాల నుండి జక్రాన్‌పల్లికి అప్ అండ్ డౌన్ చేసే సౌకర్యం ఉన్న వాళ్ళు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపిసి, సిఈసి గ్రూప్‌లో అడ్మిషన్ పొంద వచ్చని తెలిపారు. (ఆర్మూర్, నిజామాబాద్ నుండి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యం కలదని తెలియజేశారు.) ఉచిత విద్య పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ ఇవ్వవడుని తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేసిన ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణానికి చెందిన ఏఐటీయూసీ నాయకులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. జూన్ 26న జక్రాన్ పల్లి మండలంలోని పడ్కల్ గ్రామంలో బైక్ డీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ షరిఫ్ బ్రెయిన్ డెడ్ అయ్యారు. ఆయన ఆర్మూర్ పట్టణంలో ఆశా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుడు నిరుపేద కావడంతో అతని కుటుంబానికి ఏఐటీయూసీ నాయకలు అండగా నిలబడ్డారు.


ఆర్థిసాయాన్ని అందజేస్తున్న నాయకులు

అన్ని గ్రామాల ఆటో డ్రైవర్స్ తరపున మంగళవారం ఏఐటీయూసీ ఆఫీస్‌లో బాధిత కుటుంబీకులకు ఆరెపల్లి సాయిలు ఆధ్వర్యంలో 23వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బక్కన్న.మాదరి నరేష్. రమేష్.శ్రీను.ముప్పారం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐకి సన్మానం


ఎస్సైని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-బాల్కొండ
మండలానికి నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మోహమ్మద్ యాసీర్ అరఫత్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ కిసాన్ నగర్ గ్రామ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కనికరపు గంగాధర్, డిసిసి డెలిగేట్ మండల ఉపాధ్యక్షులు తమ్మె కపిల్ కుమార్, మండల ఉపాధ్యక్షులు జక్క రాజాలింగం, సీనియర్ నాయకులు చాట్ల నరేష్ చైనీ నగేష్, చిలువేరీ లక్ష్మీనారాయణ, మ్యాక నరేందర్, షేక్ అక్బర్, మామిడాల రవికుమార్, బ్రహ్మదండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ


కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ... ఏర్గట్ల గ్రామానికి 10, బట్టాపూర్‌కు 1, దోంచందకు 3, గుమ్మిర్యాల్‌కు 3, తడపాకల్ కు 3, తాళ్ళ రాంపూర్‌కు 2, తొర్తికి 1 చొప్పున చెక్కుల రాగా వాటిని లబ్ధిదారులకు అందజేశామన్నారు. ఇందులోభాగంగా కాంగ్రెస్ నాయకులు ఆడేం గంగాప్రసాద్, రవి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందించిన చేపూర్ గ్రామ పూర్వ విద్యార్థులు


ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని చేపూర్ హైస్కూల్ 1998, 1999 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఇటీవల మృతిచెందిన వన్నెల (మంగళి) ప్రభాకర్ కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం మంగళవారం అందించారు. ఈ సందర్భంగా బ్యాచ్‌కు చెందిన అగల్దివిటి శివ మాట్లాడుతూ.. మా బ్యాచ్ తరపున మీ కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని మృతుని కుటుంబానికి తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ మీఞుగు రాజేశ్వర్ బ్యాచ్‌కు చెందిన పొద్దుటూరి శ్రీకాంత్, బట్టు గంగ ప్రసాద్, పొద్దుటూరి గంగ మోహన్, బిజెపి యూత్ నాయకుడు బబ్లూ, శివ రాజ్ మంగళి శ్రీనివాస్, మహిళా నాయకురాలు లత పాల్గొన్నారు.


టీకాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సంతోష్

బీసీజీ టీకాలపై అవగాహన

నవతెలంగాణ-బాల్కొండ
బీసీజీ టీకాపై మంగళవారం కిసాన్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు హాజరైన ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు చిన్న పిల్లలకు ఈ టీకా ఇచ్చేవారని తెలిపారు. 2025 సంవత్సరం వరకు టిబి ని నిర్మూలించడంమే లక్ష్యం దిశగా ముందుకు వెళ్తున్న సందర్భంగా పెద్దలకు కూడా బీసీజీ వ్యాక్సిన్ ను ఆగస్ట్‌లో ఇవ్వబోతున్నామని తెలిపారు. ముందుగా క్షయ వ్యాధిగ్రస్థుల ఇంటిలో నివసిస్తున్న వారికి, 60సంవత్సరాలు ప్రభావం ఉన్న వారికి, పొగత్రాగే వారికి, డయాబెటిక్‌తో బాధ పడుతున్న వారికి, పోషకాహర లోపం వారికి ఈ వాక్సిన్ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ నగర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి , జిల్లా టిబి కోఆర్డినేటర్ రవిగౌడ్, ఎంపిహెచ్ఎస్ వాణి, ఎంఎల్ హెచ్ పి వందన, ఆశా కార్యకర్తలు

ఎంపీటీసీలకు ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-మోపాల్
మండల పరిషత్ ఆవరణలో ఎంపీటీసీలను ఎంపీడీవో, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు కలిసి మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లతా కన్నీరాం మాట్లాడుతూ.. అరకొర నిధులతో వాగ్దానాలు ఒకటి కూడా నెరవేరుతుందని నమ్మకం కలగలేదని కానీ తన మామయ్య ఆర్అండ్‌బి ఈఎన్‌సిగా పనిచేస్తున్న మోహన్ నాయక్ కృషితో దాదాపు 50 కోట్ల వరకు నిధులు తీసుకొచ్చి మండలంతో పాటు పక్క మండలం కూడా నిధులు ఇప్పించడం జరిగిందని తెలిపారు. బీఫామ్ అందించి ఎంపీపీగా చేసిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కొత్త మండలానికి తొలి ఎంపీపీగా అయ్యానని అన్నారు. అనేక కారణాలవల్ల కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని, ఎమ్మెల్యే భూపతిరెడ్డి గౌరవంగా చూసుకుంటున్నారని ఆయనకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో ఎంపీటీసీకి గౌరవం కూడా లేకుండా పోతుందని, నిధులు ఎలాగో లేవు, కనీసం గ్రామ పంచాయతీలలో కూర్చి కూడా ఉండటం లేదని తెలిపారు. తమ ఆవేదనను ఇప్పుడైనా అర్థం చేసుకొని ఎన్నికల తర్వాత వచ్చే ఎంపీటీసీల కైనా గౌరవప్రదమైన స్థానం ఇవ్వాలని కోరారు. కనీసం గ్రామ సమస్యలను తీర్చే విధంగా నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే విధంగా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌కు ఏ విధమైన గౌరవం ఇస్తారో.. ఎంపీటీసీల కూడా అదే గౌరవం ఇవ్వాలని వారిని కోరారు. మళ్లీ అవకాశం వస్తే ఖచ్చితంగా పోటీ చేస్తానని, మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. మహిళా కార్యదర్శులు ఎంపీపీ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లింగం నాయక్ మాట్లాడుతూ ఈ మండలానికి ఎంపీడీవోగా వచ్చి రెండు సంవత్సరాలు అయిందని, ఎంపీటీసీలు అందరూ సహకరించారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఎంపిటిసి లకు సరైన నిధులు ఇవ్వక , మండల పరిషత్‌లకు కూడా సరియైన నిధులు లేక వారు ఇబ్బంది పడ్డారని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు పొందాలని ప్రజాసేవలో వారుండాలని ఆయన కోరుకున్నారు. పదవిలో ఉన్నా.. లేకున్నా.. ఇంతకుముందులా గౌరవిస్తామని ఆయన తెలిపాడు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర అధ్యక్షుడు, మోపాల్ మండల కార్యదర్శి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో ప్రజా ప్రతినిధులకు ప్రత్యేకత ఉందని ఎందుకంటే ఇక్కడ ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పిటిసి మహిళలే ఉండడం అని అన్నారు. ఎంపీపీ లతా కన్నీరం తన ఇంటిని ఎలా చక్కబడుతుందో మండలంలోని ప్రజల సమస్యలను కూడా అలాగే చక్క దిద్దుతూ వారికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందించారని తెలిపారు. కొత్త మండలంవల్ల ఇబ్బందులు ఎదురైనా వాటిని ఎదుర్కొంటూ మండల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనిత ప్రతాప్, ఎంపీటీసీలు సంగ్యా నాయక్, సిర్పూర్ ఎంపిటిసి రఘు, మోపాల్ ఎంపిటిసి ముత్యం, రాములు, పల్లికొండ రమేష్, వివిధ గ్రామల ఎంపీటీసీలు అలాగే మాజీ సర్పంచ్ ముత్యం రెడ్డి, నాయకులు సతీష్ రెడ్డి, మండల సిబ్బంది ప్రదీప్, ప్రియాంక, సునీత, కార్యదర్శులు మృదుల, ధీరజ్, నవీన్, హరీష్, భార్గవ్, సాయి, చైతన్య శ్యామ్, స్వప్న, ఆర్మీ రాజు తదితరులు పాల్గొన్నారు.


మోపాల్: ఎంపీటీసీలను సన్మానించిన మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు


బాల్కొండలో...

బాల్కొండ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజా ప్రతినిధులకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈనెల 4వ తేదీన ఎంపీపీ ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యుల పదవి కాలం ముగుస్తుండడంతో ఈ సందర్భంగా వారికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి ,ఎమ్మార్వో శ్రీధర్, డిప్యూటీ ఎమ్మార్వో వినోద్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏపీవో ఇందిరా, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

- అనుమతి లేని కళాశాలలను బహిర్గతం చేయాలి
- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
నిజామబాద్ జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల దోపిడిని అరికట్టాలని పీడీఎస్‌యూ నాయకులు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క, గణేష్,ఉపాధ్యక్షులు అశుర్, అనిల్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియమించకుండా విద్యార్థుల సంఖ్య ఎలా పెరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలకు అనుమతులు లేకుండా, సౌకర్యాలు లేకుండా, క్వాలిఫికేషన్ లేని టీచర్ల విద్యాబోధన చెస్తున్నా జిల్లా అధికారులు నిమ్మకునీరెత్తి నట్లు ఉండడం సిగ్గుచేటన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలో పుస్తకాలముతున్న, ఇష్టం వచ్చినట్టు ఫీజులు వసూలు చేస్తున్నా, జిల్లా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో ఫీజులను డిస్ప్లే చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల పేర్లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలలో నెలకొన్న ప్రతీ సమస్యను పరిష్కరించి ప్రైవేటు కార్పొరేట్ దోపిడి నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే విద్యార్థి ఉద్యమాలు ఉధృతం అవుతాయని, జరిగే పరిణామాలకు జిల్లా విద్యాధికారులు, ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. జిల్లా సహాయ కార్యదర్శి చందు, కోశాధికారి: నిఖిల్ నాయకులు మహిపాల్, మమత పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థికసాయాన్ని అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామానికి చెందిన బోదాస్ గంగాధర్ 15 రోజుల క్రితం ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుండి పడి మరణించారు.అతనికి భార్య ముగ్గురు పిల్లలున్నారు.వారి కుటుంబం ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నారని, విషయం తెలుసుకున్న తాళ్ళ రాంపూర్ గ్రామం "మన ఊరు మన బడి" యూఏఈ,ఎన్ఆర్ఐ సంఘం వారు బాధిత కుటుంబానికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయం మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మా గ్రామంలో ఆపదలో ఉన్నవారిని మా ఎన్ఆర్ఐ సంఘం తరపున ఆదుకోవాలని అనుకున్నామని అన్నారు. అందులో భాగంగానే బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. కార్యక్రమంలో అందుబాటులో ఉన్న యూఏఈ ఎన్ఆర్ఐ ప్రతినిధులు ఆడేం ప్రతాప్,ఉత్కం శ్యామ్ సుందర్ గౌడ్, బండి సృజన్, బోదాస్ దేవేందర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామ్ నగర్ కాలనీలో సమస్యలపై మేయర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వర్ని రోడ్డులోని శ్రీ రామ్ నగర్ కాలనీలో స్థానికుల సమస్యలపై నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ స్పందించి కాలనీలో పర్యటించారు. స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని నాగపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను ఆయన సందర్శించి పరిశీలించారు. మురికి కాలువల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడేందుకు ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి సంధ్యకు సూచించారు. మురికి కాలువల్లో, నీరు నిల్వ ఉండే గుంతల్లో పంచాయతీ పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కార్యదర్శికి సూచించారు. ప్రజలకు నల్ల నీటిని అందించే పైప్ లైన్‌లకు లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. పైప్ లైన్ లీకేజీలు ఏమైనా ఉంటే తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని, వనమహోత్సవం ఫిట్టింగ్ సైట్‌ను ఆయన పరిశీలించారు. త్వరలో చేపట్టనున్న మొక్కలు నాటే కార్యక్రమం కోసం అవసరమైన మొక్కలను సిద్ధంగా ఉంచాలని నర్సరీ నిర్వాహకులకు సూచించారు. అంతకు ముందు ఆయన గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఇంటి పన్నుల వసూలను పెంచాలన్నారు. వంద శాతం పన్నుల వసూలుకు సిబ్బంది కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పిల్లలు విద్యలో.. మెరుగుపడేలా కృషి చేయాలి

- ఉపాధ్యాయులను సన్మానించిన పాఠశాల మాజీ చైర్మన్ రాజేందర్


ఉపాధ్యాయులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
విద్యలో అన్ని రకాలుగా పిల్లలను మెరుగుపడే విధంగా కృషి చేయాలని మండలంలోని బ్రాహ్మణపల్లి పాఠశాల మాజీ చైర్మన్ కొప్పు రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలో భాగంగా మనోరహాబాద్ పాఠశాల నుండి బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలకు టీచర్లుగా విచ్చేసిన నర్సారెడ్డి, మరియు మేడమ్‌ను కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల మాజీ చైర్మన్ కొప్పు రాజేందర్ మాట్లాడుతూ.. చదువులో మెలుకులను నేర్పించి ప్రాథమిక విద్యలో అన్ని రకాలుగా విద్యార్థులు మెరుగుపడే విధంగా కృషి చేయాలని టీచర్లను కోరారు. కార్యక్రమంలో మాజీ స్కూల్ చైర్మన్, బీజేపీ కార్యవర్గ సభ్యులు కొప్పు రాజేందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్యామ్, బరుకుంట్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు వెంటనే పూర్తిచేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని నాగపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ పరిశీలించారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన మరుగుదొడ్ల మూత్రశాలలు, తాగునీటి వసతి పనులను ఆయన పరిశీలించారు. త్వరితగతిన తాగునీటి వసతి పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్ కు సూచించారు. వాటర్ ట్యాంక్ పనులు పూర్తయినందున ట్యాంకుకు వెంటనే నీటి పైప్ లైన్ కనెక్షన్ ఏర్పాటు చేసి పనులు పూర్తి చేయాలన్నారు. మరుగుదొడ్లు మూత్రశాలల పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందు బాటులోకి తీసుకురావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ ను ఆయన పరిశీలించారు. పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల, బడి బయట పిల్లల వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాసం శ్రీనివాస్ గౌడ్ ను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేడు రైతు వేదికలో సమావేశం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక సమావేశాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు సహకార సంఘం కార్యదర్శి బాబురావు మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో రైతుభరోసా పథకం అమలుపై రైతులు, సహకార సంఘాల సభ్యుల నుంచి అభిప్రాయాల సేకరించేందుకు మద్నూర్ రైతువేదికలో హాజరు కావాలని సంఘం కార్యదర్శి జె.బాబురావు కోరారు.


మాట్లాడుతున్న కార్యదర్శి బాబురావు

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భాగిర్థిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రమేష్ (29) ఇల్లు కట్టుకోవడానికి, ఇతర ఇంటి ఖర్చులకు అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతూ గత నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. నోటి నుంచి నురుగు గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా రామయంపేట్ పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాదులోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రమేష్ మరణించడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

సమస్యలు చెప్పండి.. పరిష్కరిస్తాం

- ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ
- అధికారులు, ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం
- సమస్యలు తెలియజేసిన అధికారులు
- ప్రైవేట్ స్కూల్ ఫీజులు నియంత్రించాలని ఆదేశం
- పదవి ముగిసిన ఎంపీటీసీలకు సన్మానం



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సమస్యలను పరిష్కారం చేసి చూపిస్తామని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. మంగళవారం భిక్కనూర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన మండల ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని అధికారులు సమస్యలు తెలియజేయాలని సూచించారు. వ్యవసాయ అధికారి రాధా మాట్లాడుతూ.. మండలంలో ఏడు సొసైటీలు ఉన్న కారణంగా రైతులకు విత్తనాల సమస్య లేదని ఇటీవల కాలంలో విత్తనాల సమస్యను తమ దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారం జరిగిందని తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, రామలక్ష్మి మాట్లాడుతూ.. కొన్నిచోట్ల విద్యుత్ సమస్యలు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమ సమస్యలను షబ్బీర్ అలీకి తెలియజేశారు. అధికారులు తెలియజేసిన సమస్యలను షబ్బీర్ అలీ ఫోన్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలని అధికారులకు తెలియజేశారు. ఆయా శాఖల అధికారులు ప్రజల సమస్యలు తమ దృష్టికి వస్తే వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీటీసీ మోహన్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, అయ్యవారిపల్లి గ్రామ ప్రజలకు రేషన్ సరుకుల కొరకు పెద్ద మల్లారెడ్డి రావాల్సి వస్తుందని గ్రామంలో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని సమస్యలను గుర్తించి ఏ విధమైన సౌకర్యాలు కావాలో తమకు తెలియజేయాలని మెడికల్ ఆఫీసర్ యేమిమాకు తెలిపారు. అలాగే అయ్యవారిపల్లి గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్ షాప్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మార్వో శివ ప్రసాద్‌కు సూచించారు.

ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలి..

ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీ అధికంగా ఉందని, ఏ పాఠశాలలో కూడా ఫీజుల పట్టిక, సరైన సౌకర్యాలు లేక ఉన్న విషయాన్ని ఎంఈఓ ఎల్లయ్యకు షబ్బీర్ అలీ తెలియజేయగా ప్రైవేట్ పాఠశాలలకు ఎన్నిసార్లు నోటీసులు అందజేసినా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని షబ్బీర్ అలీకి తెలపడంతో వెంటనే శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిమితికి మించి బస్సులలో విద్యార్థులను ఎక్కించుకోవడం, ఫీజుల దోపిడీని వెంటనే అరికట్టాలని ఎంఈఓను ఆదేశించారు.

విద్యుత్ పోల్ తొలగించాలని డబ్బులు ఇచ్చిన షబ్బీర్ అలీ..

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో గిద్ద హరిజనవాడ కాలనీ వెళ్లే దారిలో రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ పోల్ తొలగించాలని కాలనీవాసులు విద్యుత్ అధికారులకు తెలియజేయగా విద్యుత్ పోల్ మార్చడానికి డబ్బులు చెల్లిస్తే మారుస్తామని తెలియజేసిన విషయాన్ని షబ్బీర్ అలీ దృష్టికి తీసుకురాగా వెంటనే స్వయంగా షబ్బీర్ అలీ విద్యుత్ పోల్ మార్చడానికి రూ.13 వేలు విద్యుత్ ఏఈ శ్రీనివాస్, రామలక్ష్మికు అందజేశారు. వీలైనంత త్వరలో విద్యుత్ పోల్ మార్చాలని తెలిపారు. అలాగే కంచర్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యుత్ పోల్‌ను తొలగించాలని, విద్యుత్ శాఖ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

పదవీ ముగిసిన ఎంపీటీసీలకు సన్మానం..

ఐదు సంవత్సరాలు ఎంపీపీ, ఎంపీటీసీ పదవిలో ఉండి పదవి ముగుస్తున్న ప్రజాప్రతినిధులకు షబ్బీర్ అలీ శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో ప్రజలకు అందుబాటులో ఉండి మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని సూచించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం నుంచి మండల పరిషత్ పాలకవర్గాన్ని సన్మానించారు. పదవి ముగుస్తున్న ఎంపీటీసీలకు ఎంపీపీ గాల్‌రెడ్డి మెమోంటో అందజేసి శాలువాతో సత్కరించారు. అంతకుముందు ప్రభుత్వ సలహాదారుడిగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన మహమ్మద్ షబ్బీర్ అలీకి ఘనంగా స్వాగతం పలికి అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, డిసిసిబి డైరెక్టర్లు కృష్ణగౌడ్, సిద్ధ రాములు, మండల ప్రత్యేక అధికారి రజిత, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, మండల పరిషత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

4 గ్రామాలను భిక్కనూర్ పిహెచ్‌సీలో కలిపేందుకు కృషి చేస్తా

భిక్కనూర్ మండలంలో 18 గ్రామ పంచాయతీలుండగా అందులో 4 గ్రామ పంచాయతీలు తిప్పాపూర్, మోటాటిపల్లి, జంగంపల్లి, అంతంపల్లి గ్రామాలు రాజంపేట్ పట్టణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కారణంగా గ్రామాల ప్రజలు ఆరోగ్య సమస్యల కొరకు ఇబ్బందులు పడుతున్నారని నవతెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ప్రజా ప్రతినిధులు మంగళవారం మండల ప్రత్యేక సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ దృష్టికి ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్రకాంత్‌రెడ్డి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌తో చర్చించి వీలైనంత త్వరలో నాలుగు గ్రామాలను భిక్కనూర్ పిహెచ్సి పరిధిలో కలపడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పీహెచ్సీ సమస్య పరిష్కారం కొరకు షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్లు కృష్ణగౌడ్, సిద్ధ రాములు, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, బాబు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులు పంపిణీ


విద్యార్థులకు బుక్స్, పెన్నులు పంపిణీ చేస్తున్న సిఐ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల పరిధిలోని వెల్లుట్లపేటలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్ నోటుబుక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉన్నత శిఖరాలకు ఎదిగిన మహానుభావులందరూ అత్యధికంగా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించారని తెలిపారు. తాను చిన్నప్పుడు నిజాంసాగర్ నవోదయ పాఠశాలలోని చదివానని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తన వంతుగా సహాయం చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అశోక్‌గౌడ్, ప్రేమ్‌సింగ్, మాజీ సర్పంచ్ సుతారి సాయిలు, గణపతి, రాజాగౌడ్, కిషన్, భూమయ్య సాయగౌడ్, బాలాజీ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు వెంటనే కల్పించాలి

- ఎమ్మార్వోకు వినతి


ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వెంటనే కల్పించాలని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రాన్ని అందజేశారు. బీజేవైఎం మండలాధ్యక్షుడు మార్గం రజనీకాంత్ మాట్లాడుతూ.. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని, పోలీసు నియామకాల్లో యువత నష్టపోతుందని, అందుకుగాను జీవో 46ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మార్వో అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు మార్గం రజిని కాంత్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి రవి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, టౌన్ అధ్యక్షులు సురేష్, బీజేవైయం మండల నాయకులు వంశీ కృష్ణ, సుభాష్, రాజు, ప్రవీణ్, శ్రీకాంత్, రంజిత్, రాకేష్, సంతోష్, శివ, నరేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల పట్ల వివక్ష చూపితే చర్యలు

- ఏఎస్ఐ లింబాద్రి


మాట్లాడుతున్న ఏఎస్ఐ లింబాద్రి

నవతెలంగాణ-పిట్లం

దళితుల పట్ల వివక్ష చూపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ లింబాద్రి అన్నారు. మంగళవారం మండలంలోని చిల్లర్గి గ్రామంలో సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులను హోటల్లోనూ, ప్రార్థన మందిరాల్లో అంటరానివారని అవమాన పర్చితే లేదా తక్కువ కులం, తక్కువ జాతి అని సంభాషించినా, కులం పేరుతో తిట్టి దుర్భాషలాడినా, అవహేళన చేసినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు. వారిపై ఇండియన్ క్రిమినల్ చట్ట ప్రకారం శిక్షార్హులని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఆర్ఐ శీతల్, మాజీ సర్పంచ్ రమేష్, గ్రామపెద్దలు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-రెంజల్


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

జూలై నెల డెంగ్యూ నెలగా పరిగణించబడుతుందని అందులో భాగంగా ఈ నెలలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డివిజనల్ సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉంటే దోమలు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దోమ కాటు వల్ల ఫైలేరియా, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని ఆయన తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఈ చిన్న సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి శ్రావణ్ కుమార్, పీహెచ్ఎన్ రాణి, సూపర్వైజర్ మాలంబి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ గ్రామ శివారులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలో సమాచార హక్కు చట్టం 2005 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వి.రాధిక అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం పాల్గొని ఈ సందర్భంగా విద్యార్థినీలకు సమాచార హక్కు చట్టం 2005పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఎస్.శ్వేత మాట్లాడుతూ.. మహిళా హక్కులు చట్టాలపై విద్యార్థులకు తెలియజేశారు. జిల్లా సలహాదారులు పి.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం దరఖాస్తు విధానాన్ని, అప్పీల్ విధానాన్ని వివరించారు. న్యాయవాది ఈక శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాల కార్మిక హక్కు చట్టం బాల్య వివాహ నివారణకు చట్టం మొదలగు చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ సాదిక్ అలీ, కళాశాల ఇంగ్లీష్ సీనియర్ లెక్చరర్ బి.వెంకటేశ్వర్‌రావు, అధ్యాపక బృందం విద్యార్థినిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందించాలి

- ఎంపీపీ దశరథ్‌రెడ్డి



పీహెచ్‌సీ వైద్యుడిని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందించి, పేదలకు మెరుగైన విద్యను అందించాలని ఎంపీపీ దశరథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి అధ్యాపకులతో సమావేశమై, విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను బోధించి, వచ్చే విద్యా సంవత్సరమైనా మెరుగైన ఫలితాలను సాధించేందుకు, అధ్యాపకులు సమయపాలన పాటిస్తూ, కార్యాచరణ రూపొందించుకుని నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని సూచించారు. అంగన్వాడీలో రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేవని అంగన్‌వాడీ టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ అవార్డు వచ్చినందున పిహెచ్సి వైద్యులను, సిబ్బందిని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు. భవిష్యత్‌లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లక్ష్మాగౌడ్, వైద్యులు సురేష్, బీఆర్ఎస్ నాయకులు లింబాద్రి నాయక్, జంగం లింగం, మాజీ ఎంపీటీసీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి


లింగంపేట్: అభిప్రాయాలను తెలుసుకుంటున్న అధికారులు


పిట్లంలో..

- సింగిల్ విండో చైర్మన్ నాగిరెడ్డి

నవతెలంగాణ-పిట్లం/లింగంపేట్

రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని చిన్నకొడప్‌గల్ సింగిల్ విండో చైర్మన్ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకం అమలుపై సహకార సంఘం సభ్యులకు అభిప్రాయ సేకరణ, సూచనలపై రైతు వేదికలో ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు పాస్ బుక్ ఒక్కంటికి ఐదు ఎకరాలకు రైతుబంధు వర్తింపచేయాలని సూచించారు. చిన్న స్థాయి ఉద్యోగులందరికీ ఐదు ఎకరాల వరకు రైతుబంధు అమలు చేయాలని సభా దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం తదితర గ్రామాల రైతులు మాట్లాడుతూ.. 10 ఎకరాలు ఉన్న వారు కూడా రైతులేనని, వారికి పెట్టుబడి అవసరముంటుందని, పది ఎకరాలను పరిగణలోకి తీసుకుని రైతుబంధు వర్తింపచేయాలని అన్నారు. మరికొందరు మాట్లాడుతూ.. ఉద్యోగం కష్టపడి చదివితే వచ్చింది కనుక వారికి భూములు కలిగి ఉన్నాయని, కాబట్టి ఉద్యోగానికి, వ్యవసాయానికి బేధాభిప్రాయాలు లేకుండా రైతుబంధు వర్తింపచేయాలని అన్నారు. ఇంకొందరు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పంపిణీ చేసిన అసైన్మెంట్, శిఖం, పరం పోగు భూములకు పట్టాపాస్ బుక్కులు అందజేసి రైతుబంధు అమలుపర్చి పేద కుటుంబాల రైతులను ఆదుకోవాలని సభాముఖంగా కోరారు. కాగా తిమ్మానగర్, చిల్లర్గి ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతుబంధు అమలు సభలను రైతువేదికల యందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు పథకం జిల్లా ప్రత్యేక అధికారి రామ్మోహన్, కోఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, బిచ్కుంద ఏడిఏ లక్ష్మీ ప్రసన్న, స్థానిక నాయకులు ఎంపీటీసీ వెంకటరెడ్డి, మాజీ డిసిసిబి డైరెక్టర్ చింతల సాయిరెడ్డి, మల్లప్ప పటేల్, మొగులగౌడ్, ఏఈఓ సురేష్, సంఘం డైరెక్టర్లు, సీఈవో హనుమాగౌడ్, ఆయా గ్రామాల చైర్మన్లు, ఏఈఓలు, విండో కార్యదర్శులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో రైతుల అభిప్రాయ సేకరణ..

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాల్లో గల సహకార సంఘాల్లో రైతుబంధు పథకంపై మంగళవారం రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. మండలంలోని నల్లమడుగు, శెట్పల్లి సంగారెడ్డి, లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ఏడిఏ వీరస్వామి ఆధ్వర్యంలో రైతుల రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ సమావేశాలను నిర్వహించారు. రైతుల సూచనలు, సలహాలను సేకరించారు. పదెకరాల పంట సాగుచేసే భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అసైన్మెంట్ భూములకు, రైతు భరోసా ఇవ్వాలని రైతులు వివరించారు. అదేవిధంగా 20 ఎకరాలలోపు రైతులకు రైతుబంధు ఇవ్వాలని మరి కొంతమంది రైతులు వివరించారు. అంతేకాకుండా రైతుబంధులో పాతవిధానాన్ని కొనసాగించాలని మరికొంతమంది రైతులు తమ అభిప్రాయాన్ని వివరించారు. పంటలు సాగుచేస్తేనే పెట్టుబడి సాయం అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఏడిఏ వీరస్వామి మాట్లాడుతూ.. రైతుల అభిప్రాయాలను, సూచనలను ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ కూచంపల్లి దేవేందర్‌రెడ్డి, నల్లమడుగు సింగిల్‌విండో చైర్మన్ రమేష్, శెట్పల్లి సంగారెడ్డి సింగిల్ విండో చైర్మన్ సుకన్య, అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ అధికారి శ్రీనివాస్, కార్యదర్శులు సందీప్, శ్రీనివాస్, మైపాల్, వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల మహా జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

మాదిగ రాజకీయ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు బి.ఎన్ రమేష్ కుమార్ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ స్థాపించి 30 సంవత్సరాలు నిండిన సందర్భంగా మాదిగల మహా జాతర చలో ఈదుముడి నాగులుప్పపాడు ప్రకాశం జిల్లాలో జరిగే పోస్టర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగయ్య మాట్లాడుతూ.. ఎస్సీ ఏ, బిసిడి రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై ఎమ్మార్పీఎస్ స్థాపించి 30 సంవత్సరాలు నిండిన సందర్భంగా మాదిగల మహాజాతర జూలై 7వ తేదీన చలో ఈదురుముడి నాగులుప్ప పాడు పోస్టర్‌ను ఆవిష్కరించారు. జులై 7వ తేదీన జరిగే చలో ఈదురుముడి సభకు మాదిగలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి ఇంత వరకు చేయలేదని అన్నారు. కేంద్రంలో మళ్లీ ఇప్పుడు అధికారంలోకి రాగానే 100 రోజులలోనే ఎస్సీ వర్గీకరణ చేస్తానని భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పారని, ఇప్పటికీ ఎస్సీ వర్గీకరణ చేయడం లేదని తెలిపారు. ఇప్పటికే మూడు కమిటీలు వేసినట్టు తెలిపారు. ఇదంతా వర్గీకరణ కోసం కాదని జాప్యం చేసి పబ్బం గడుపుకోవడానికి మాత్రమే చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అశోక్, ఆర్.సాయిలు, లక్ష్మీ, బాలామణి, ఆర్.చిన్న రాజయ్య, కొత్తూరి గంగాధర్, పాపార్తి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని నర్సరీని మండల ప్రత్యేకాధికారి రజిత, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో పెద్దఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ మొక్కలు అందజేసి ఇంటి పరిసరాలలో నాటే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, సిబ్బంది, తదితరులున్నారు.

మొక్కలు నాటిన ఎంపీపీ, జడ్పిటిసి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని తాండూర్ ఫారెస్ట్ పరిధిలో మంగళవారం ఎంపీపీ టేకులపల్లి వినీత జడ్పిటిసి మనోహర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూర్ ఫారెస్ట్ పరిధిలో 200 మొక్కలు నాటినట్లు వారు పేర్కొన్నారు. వారి వెంట ఫారెస్ట్ అధికారులు ఉన్నారు.

పాడే మోసిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్

నవతెలంగాణ-ఆర్మూర్



కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి చిన్న నాన్నమ్మ మంగళవారం మృతిచెందారు. వారి అంతక్రియలలో పాల్గొని స్వయంగా పాడే మోశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాలకంటి శంకర్(వాసు) డీసీసీబీ డైరెక్టర్ మాతృమూర్తి మరణించగా వారి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు ఫ్రీ హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ విద్యుత్ డివిజనల్ కార్యాలయం నందు డిఈసిహెచ్ హరిచంద్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్రీ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హైదరాబాద్ యశోద హాస్పిటల్ డాక్టర్లు విచ్చేసి ఎంప్లాయిస్ ఫ్రీ హెల్త్ చెకప్ చేసుకున్నారు. కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ సత్య సుదిష్ కార్డియాలజిస్ట్, వినయ్ కుమార్ మేనేజర్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ మహిపాల్, తదితరులు పాల్గొన్నారు. వారికి ఎన్పీడీసీఎల్ డివిజన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



చెకప్ చేసుకుంటున్న ఉద్యోగులు

రాహుల్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



పార్లమెంట్ సాక్షిగా చట్టసభల్లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హిందువులను అవమానించే విధంగా కించపరుస్తూ మాట్లాడారని ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఖండించారు. పదేళ్లు అయినా ప్రతిపక్ష హోదా రాని కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు కూడా గెలవని రాహుల్ మతిలేని మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. అయోధ్య రామమందిరం పునఃప్రతిష్ట కార్యక్రమానికి ఆహ్వానిస్తే కూడా కాంగ్రెస్ నాయకులు రాలేదని, అదే ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్న బాబా సమాధికి వెళ్లడానికి మాత్రం సమయం ఉన్నాయని తెలిపారు. తెలంగాణాలో కూడా రేవంత్ సర్కార్ ఓ వర్గంపై తెగప్రేమ ఒలకపోస్తున్నాడని, కేంద్రం ఉగ్రవాద సంస్థగా గుర్తించి నిషేధించిన జామాతే ఇస్లామి సంస్థకు ప్రభుత్వం నుండి 2 కోట్లు విడుదల చేయడం సభకు వికారాబాద్ లో సకల వసతులు కల్పించడం బట్టే తెలుస్తుందని అన్నారు. కాంగ్రెస్ తోక పార్టీ ఎంఐఎం అధినేత జై పాలస్తీన అనడం, రాహుల్ చేసిన వ్యాఖ్యలకు యావత్ హిందూ సమాజం ఖండిస్తుందని అన్నారు. వెంటనే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని, బిజెపి గురించి, హిందువుల గురించి మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు.

10న జగన్నాథ రథయాత్ర మహోత్సవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇస్కాన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 10న డిచ్ పల్లి మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథాలయం వద్ద శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు సిద్ధ బలరాందాస్ తెలిపారు. మంగళవారం డిచ్ పల్లిలో ఆయన మాట్లాడుతూ 10న ఉదయం పదిగంటలకు రథయాత్ర ప్రారంభమై డిచ్ పల్లి ప్రధాన రహదారి మీదుగా కొనసాగుతుందని చెప్పారు. ఆ సందర్భంగా భజన, కీర్తనలు, కోలాటాలు, భక్తి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి

- ఎంపీపీ ఆర్మూర్ మహేష్



ఎంపీటీసీలను సన్మానించిన ఎంపీడీవో, సిబ్బంది

నవతెలంగాణ-భీంగల్

వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలని ఎంపీపీ ఆర్మూర్ మహేష్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని కనుక అందుకు కావాల్సిన చర్యలను చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీంట్లో భాగంగా ప్రతి శుక్రవారం డ్రై డే గా నిర్వహించి నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. అంతకుముందు ఆయా శాఖలకు చెందిన మండల అధికారులు గడిచిన మూడు నెలల కాలంలో చేపట్టిన పనుల వివరాలను, చేపట్టే పనుల వివరాలను చదివి వినిపించారు.

ఎంపీటీసీలకు సన్మానం...

మండల ఎంపీటీసీల పదవి కాలం ఈనెల 4 తో ముగియడంతో ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. పదవి కాలంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించామని అన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి రవి, ఏపీఓ నరసయ్య, అన్ని శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్సిటీ డిగ్రీ దోస్త్ ఆన్‌లైన్ ప్రత్యేక కేటగిరి ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దోస్త్ ఆన్లైన్ డిగ్రీ ప్రవేశానికి 2024 -25 సంవత్సరానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ధ్రువపత్రాల పరిశీలన అకాడమిక్ ఆడిట్ సెల్‌లో పిహెచ్‌సి (దివ్యాంగులు) 3, సిపిపి-2, ఎన్‌సిసి 6 ఎక్స్‌ట్రా కర్క్యులర్ ఆక్టివిటీస్ 1 విద్యార్థితో కలిపి మొత్తం 12 మంది విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలన జరిగిందని దోస్త్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ కే.సంపత్ కుమార్ తెలిపారు.

డిగ్రీ వన్ టైమ్ ఛాన్స్ సెమిస్టర్, బ్యాక్ లాగ్ టైం టేబుల్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని వన్ టైం ఛాన్స్ (సిబిసిఎస్) బిఎ, బీకాం, బీఎస్సీ, బిబిఏ కోర్సులకు ఐదవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షలు జూలై 25 న ప్రారంభమై 4- ఆగస్టు వరకు ఉదయం 10నుండి మధ్యాహ్నం-01 వరకు కొనసాగుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ యం. అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు

కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

తహశీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మండల ప్రజాప్రతినిధులు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఇంచార్జ్ తహశీల్దార్ పి.శ్రీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళ్యాణ లక్ష్మీ 28, షాదీ ముబారక్ 02 మొత్తం 30 చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, మండలంలోని ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

సికిల్ ఎనీమియా

ఎర్రరక్తకణాలను నాశనం చేస్తుంది

- ఇందల్‌వాయి ఆస్పత్రి వైద్యాధికారి సంతోష్
- సికిల్‌సెల్ ఎనీమియా రక్త పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో సికిల్ సెల్ ఎనీమియా రక్త పరీక్షలను మంగళవారం జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి, ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా అనునది జన్యు సంబంధమైన వ్యాధి అని, సికిల్ అనగా కొడవలి అని అర్థమన్నారు. ఇది కొడవలి ఆకారంలో కుచించుకుపోతుందని, ఇది ఎర్ర రక్త కణాలను నాశనం చేస్తుందని వివరించారు. వీటి లక్షణాల ఆధారంగా ఎనీమియా ఏర్పడుతుందని, సాధారణంగా సికిల్ సెల్ ఎనీమియా ఉన్న విద్యార్థులు అలసట ఎక్కువగా ఉండడం పాలిపోయిన చర్మం కలిగి ఉండడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తొందరగా ఇన్ఫెక్షన్లు రావడం, ఆలస్యంగా పెరగడం, పొట్టలో ఎముకలలో నొప్పి, పిత్తాశయంలో రాళ్ల వల్ల గ్యాస్ రావడంతో పొట్ట పెద్దదిగా కనిపించడం ఇది కొన్ని నెలల వయసులోనే నిర్ధారించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. వీరికి 20 నుండి 45శాతం హిమోగ్లోబిన్ కలిగిన ఎర్ర రక్త కణాలు మాత్రమే ఉంటాయని,సికిల్ సెల్ ఎనీమియా కలిగిన విద్యార్థులు సాధారణంగా పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని, ఆకుకూరలు, పండ్లు, బీన్స్ బఠానీలు ఫోలేట్‌లు కలిగిన పదార్థాలు బ్రెడ్, తృణధాన్యాలు, మొక్కజొన్న లాంటి పదార్థాలను అధికంగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అంతకు ముందు ఈ పాఠశాలలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వైశంకర్ హాస్టల్ పరిసరాలను పరిశీలించి ఆహార పదార్థాలను వండే విధానాన్ని వివరించారు. అయోడిన్ కలిగిన ఉప్పును వాడాలని సూచించారు. వంట పూర్తయిన తర్వాత అయోడిన్ కలిగిన ఉప్పును వేయాలని ఆదేశించారు. శుభ్రమైన నీటిని వంట కొరకు వాడాలని పరిసరాలు శుభ్రంగా ఉండాలని కుక్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబి కోఆర్డినేటర్ రవి, ల్యాబ్ టెక్నీషియన్ స్వామి, ఫార్మసీ సూపర్వైజర్ నారాయణ ,ఆనంద్, ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఉదయ, స్టాఫ్ నర్స్ సరిత, ఆరోగ్య కార్యకర్త గంగుబాయి ,ఆశా కార్యకర్తలు సంధ్య ,నిర్మల పాల్గొన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాల సుద్దపల్లి ని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ తనిఖీ చేసి విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.



పరీక్షకోసం రక్తాన్ని సేకరిస్తున్న వైద్యులు

పెన్షన్ సవరణ చేయాలి

- ఉమ్మడి జిల్లాల జనరల్ మేనేజర్‌కు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షన్ సవరణ చేయాలని నిజామాబాద్, అదిలాబాద్ జిల్లా కార్యదర్శులు ఈవిల్ నారాయణ, కుమార్ బాబు అన్నారు. పెన్షన్ సవరణ చేయాలని నిజామాబాద్, ఆదిలాబాద్ ఆలిండియా బిఎస్ఎన్ఎల్ , ఎంటిఎన్‌యల్ అసోసియేషన్స ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం గాంధీ చౌక్ లోని సంచార్ భవన్ వద్ద ఆల్ ఇండియా బిఎస్ఎన్, డిపార్ట్మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డిమాండ్స్ డేను నిర్వహించారు. ఏడు సంవత్సరాలుగా పెన్షన్ సవరణ జరగనందున వెంటనే పెన్షన్ సవరణ చేయాలని, బిఎస్ఎన్ఎల్ కు 4జీ /5జీ సర్వీస్ లు అందించాలనే రెండు ప్రధాన డిమాండ్లతో ఈ డిమాండ్స్ డే ని నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లా ల జనరల్ మేనేజర్ కి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమానికి తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట నాయకులు కే. రామ్మోహన్‌రావు మద్దతును తెలియజేశారు. కార్యక్రమంలో మధుసూదన్ బాల దుర్గయ్య గంగారం, ముత్తన్న, గణేష్, బాలస్వామి, నరేందర్ గౌడ్, విక్టరీయ, ఎం ఎన్ వి అనురాధ, సాయన్న, 60 మంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పెన్షనర్స్

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతి అందుకున్న విజేత జట్టు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నాగంపేట్ గ్రామంలో రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలలో మొత్తం 20 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి స్థానంలో మెండోరా, ద్వితీయ స్థానంలో నాగంపేట్ జట్లు నిలిచినట్లు ఆర్గనైజర్లు మేడిపల్లి ముత్యంరెడ్డి, మోహన్ రెడ్డిలు తెలిపారు. విజేతలకు నగదు పురస్కారాలతో పాటు ప్రత్యేక బహుమతులు సైతం అందజేశారు. మొదటి విజేత జట్టు మెండోరా కు రూ.13 వేలు, రన్నర్ జట్టు నాగంపేట్‌కు రూ.6,500 రూపాయలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు మేడిపల్లి ముత్యంరెడ్డి, మోహన్ రెడ్డి, సతీష్, అనిల్, రెడ్డీస్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పది ఎకరాల్లోపు 'రైతుభరోసా' ఇవ్వాలి

- మహాజన సభలో తీర్మానాలు

నవతెలంగాణ-భీంగల్/ఏర్గట్ల/ముప్కాల్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతుబంధును పది ఎకరాల లోపు ఉన్న రైతులకు అందజేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 109వ మహాజనసభలో రైతులు తీర్మానించారు. రైతు బంధు విధి విధానాల కోసం రైతుల సూచనలు తీసుకోవాలని అందించిన ఆదేశాల ప్రకారం మంగళవారం పట్టణ కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతుల సూచనలు స్వీకరించారు. రైతుబంధు పథకాన్ని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వకూడదని అన్నారు. అలాగే సాగు చేసే రైతులకు పదెకరాల్లో ఉన్న వారికే ఈ పథకాన్ని వర్తింపజేయాలని రైతులు తెలిపారు.

109వ మహాజనసభ...

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ శివ సారి నర్సయ్య అధ్యక్షతన 109వ మహాజనసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో అశోక్ గౌడ్ గడిచిన మూడు నెలల కాలంలో లెక్కలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఖరీఫ్ కు కావలసిన ఎరువులను ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని కనుక రైతులు ఆందోళన చెందకూడదని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు, ఏఓ సాయి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స్వామి తోపాటు రైతుల పాల్గొన్నారు.



భీంగల్ : మాట్లాడుతున్న సహకార సంఘం చైర్మన్

ఏర్గట్ల: ఏర్గట్ల, తాళ్ల రాంపూర్ పీఏసీఎస్‌లలో సంఘ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన రైతు బంధు పథకంపై రైతుల సలహాలు, సూచనల కోసం ప్రత్యేక మహాజన సభ సమావేశం నిర్వహించారు. రైతుకు ఎంత భూమి ఉన్నా, సాగుచేస్తున్న 10 ఎకరాలలోపే రైతు బంధు ఇవ్వాలని రైతులందరు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్టార్ పాపయ్య,సంఘ వైస్ చైర్మన్లు సిగసారం గంగారాం,జి.కె శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఏఈఓ లు సాయి సచిన్, శివాణి, సంఘ డైరెక్టర్లు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో..

ముప్కాల్: ముప్కాల్ రైతు వేదిక'లో రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు టెలి-కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు సూచనలను అందించారు. కార్యక్రమంలో రెంజర్ల, వేంపల్లి క్లస్టర్ల రైతులు రైతు భరోసా గురించి వారి సందేహాలను అడగగా మంత్రి నివృత్తి చేశారు. కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గం ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన రైతు గడ్డం పాలెం చిన్నారెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా పది ఎకరాలలోపు వ్యవసాయం సాగుచేస్తున్న రైతులకు మాత్రమే ఇవ్వాలని అన్నారు. గుట్టలు, బీడు భూములు ఉన్న రైతులకు ఇవ్వొద్దని, సాగు చేసే రైతులకు మాత్రమే ఇవ్వాలన్నారు. చిన్న చిన్న లోన్ల కోసం ఆదాయం పన్ను కట్టే రైతులకు సైతం రైతు భరోసా ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజ్ కుమార్, ఏఈఓలు నిషికాంత్, అరుణ, రైతులు తదితరులు పాల్గొన్నారు..

మాపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

- పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



గాయపడ్డ నడ్పి గంగాధర్, తులసమ్మ

ఇందల్ వాయి మండలంలోని గౌరరం గ్రామ పంచాయతీ పరిధిలోని లింగపుర్ గ్రామానికి చెందిన మూడెడ్ల తులసమ్మ ఆమె భర్త నడ్పి గంగాధర్ లకు గ్రామ శివారులోని సర్వే నెం: 180 లో విస్తీర్ణం 0-30 గుంటలు భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నానని తెలిపారు. ఈ భూమిని ఆక్రమించుకోవాలని గత కొన్ని రోజుల నుండి మాజీ ఎంపిటిసి మైలారం చిన్నరెడ్డి సంతోష్ రెడ్డి చూస్తున్నాడని తెలిపారు. మా భూమి సరిహద్దులు చెరిపవేసేందుకు ప్రయత్నిస్తున్నాడని దీంతో మేము అడ్డుకొన్న ప్రతిసారి మాపై దాడులు చేస్తూనే ఉన్నాడని వాపోయారు. ఆయనపై చుట్టా రిత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఇందల్ వాయి పోలీస్ స్టేషన్‌లో, నిజామాబాద్ పోలిస్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసినట్లు విలేకరులకు తెలిపారు. సంతోష్‌రెడ్డి ఆర్థికంగా బలవంతుడైనందున ఆయనతో ఘర్షణ పడలేని పరిస్థితి ఉందని అన్నారు. గత నెలా 30న మధ్యాహ్న సమయంలో తన కోడలితో కలిసి వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో మైలారం చిన్నరెడ్డి సంతోష్ రెడ్డి ఇంకోదరు వచ్చి అసభ్యంగా తిట్టి ఈ భూమిలోకి ఎందుకు వచ్చావని కడుపులో పిడిగుద్దులు గుద్దాడని వివరించారు. అడ్డు వచ్చిన నా కోడలిని కూడా కొంగుపట్టి లాగి, చెంపమీద కొట్టి, తోసి వేశాడని వాపోయారు. మీకు ఇదే చివరి అవకాశం మళ్లీ ఎప్పుడు వచ్చినా మిమ్ములను చంపి ఇక్కడే పాతిపెడతామని బెదిరించారని వివరించారు. మంగళవారం ఉదయం తాము ఇద్దరం వెళ్లగా మైలారం చిన్నరెడ్డి, సంతోష్ రెడ్డి, ఆయన అనుచరులు కలిసి కబ్జా చేస్తున్నారని, దీనిపై అడగడంతో ఇనుపరాడ్ తలపైన కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకొన్నామని తెలిపారు. దాడి చేసిన వారిపై చట్టరిత్య చర్యలు తీసుకొని న్యాయం చేసి, తన భర్తకు ప్రాణభయం ఉన్నందున, రక్షణ కల్పించాలని ఫిర్యాదులో వేడుకుంటున్నారని అన్నారు.

రాజకీయ ఎదుగుదలను జీర్ణించుకోలేక ఆరోపణలు

- ఎవరిపై దాడి చేయలేదు..
- మాజీ ఎంపీటీసీ చిన్నారెడ్డి సంతోష్ రెడ్డి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

30 ఏళ్ళుగా నా భూమిలో నేను ఆరుతడి, ఇతర పంటలు పండిచుకుంటున్నాని, ఇతరుల భూమిని కబ్జా చేయలేదని, వారిపై దాడి చేయలేదని, కావాలనే కొందరు గిట్టని వారు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే ఇలాంటి పనులకు వెనుక ఉండి చేయిస్తున్నారని మాజీ ఎంపీటీసీ చిన్నారెడ్డి సంతోష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఇందల్ వాయి మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇందల్‌వాయి మండలంలోని గౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాపూర్ వద్ద 180 సర్వే నెంబర్‌లో 630 ఎకరాల భూమి ఉందన్నారు. దీనిలో 300 ఎకరాలు ఫారెస్టుకు సంబంధించినది ఉండగా మిగతా 330 ఎకరాలు అసైన్మెంట్ భూమి ఉంద న్నారు. నాకు 1996 లో మూడు ఎకరాల భూమి ఉంద న్నారు. దానికి సంబంధించిన పాసుబుక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. ఏదో ఒక రచ్చ చేసి నష్టం చేసే దురుద్దేశంతో వెనుక ఉండి ఇలాంటి తంతంగాన్ని చేయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.180 సర్వే నెంబర్‌లో ఫారెస్ట్ భూములను కొందరు కబ్జాలుచేసి కోర్టులో కేసులు నడుస్తున్నాయని అన్నారు. నా భూమిలో ఇతరులకు సంబంధం లేదని, 180 సర్వే నెంబర్‌లోని మూడు ఎకరాలకు సంబంధించిన పాస్ బుక్‌లో నమోదైన వివరాలను విలేకరులకు అందజేశారు. దాడి ఇతరత్రా నిరాధారమైన అరోపణలు చేయడం మానుకోవాలని, తను చట్ట ప్రకారంగానే నడుచుకుంటానని సంతోష్ రెడ్డి వివరించారు.

బాధ్యతలు చేపట్టిన పీఆర్ డిప్యూటీ ఇంజనీర్‌కు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

పంచాయత్ రాజ్ శాఖలో ఇటీవలే బాధ్యతలు చేపట్టిన డీఈ మధుబాబును కాంగ్రెస్ వర్కింగ్ మండల ప్రెసిడెంట్ అస్పత్‌వార్ వినోద్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఆర్ డీఈ మధుబాబు, ఏఈ శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపిపి లక్ష్మన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.


డీఈని సన్మానిస్తున్న నాయకులు

మాజీ స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన అభిమానులు

నవతెలంగాణ-వర్ని

మాజీ స్పీకర్, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి మొదటి సారిగా బాన్సువాడకు రావటంతో అయన అభిమానులు శ్రీనగర్ మాజీ సర్పంచ్ రాజు, కోఆప్షన్ మెంబర్ ఖరీమ్ ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.


పోచారంను కలిసిన నాయకులు

గుంతలు.. గతుకులు

- ఎడపల్లి బస్టాండ్ దుస్థితి
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ గుంతల మయంగా మారింది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షానికి గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారింది. దీంతో బస్టాండ్‌కు బస్సులు వచ్చే సమయంలో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌ను ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ హయాంలో నిర్మించారు. మూత్రశాలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాన్ని అప్పట్లో కల్పించారు. ఎడపల్లి మండల చుట్టుపక్కల గ్రామాల వారు పట్టణ ప్రాంతాలకు ఇరువైపులా వెళ్లాలంటే ఎడపల్లి బస్టాండ్‌కు రావాల్సిందే. అయితే కొన్ని సంవత్సరాలుగా బస్టాండ్‌లోకి బస్సులు రావడం లేదు. ఇందులో కేవలం సంచార జాతులవారు మాత్రమే తలదాచుకునేవారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టిఎస్ ఆర్‌టిసి బస్సులు డిపోల వారీగా ప్రయాణికుల సౌకర్యం మేరకు తప్పకుండా బస్టాండ్‌లోకి వెళ్లాలని డిపో మేనేజర్లను ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం. బోధన్ టిఎస్ ఆర్‌టిసి డిఎం శ్రీనివాస్ బస్టాండ్‌లో కంట్రోలర్‌లను ఏర్పాటు చేసి బోధన్ టు నిజామాబాద్ వెళ్లే బస్సులను బస్టాండ్‌లోకి పంపించే విధంగా చర్యలు తీసుకున్నారు.

ఎత్తుపల్లాలు..

ఇదిలా ఉండగా బురద గుంట ప్రధాన దారి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే ముందు రోడ్డు అంతా ఎత్తు పల్లాలుగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రయాణికులు అంటున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్ ముందు గల గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.



బస్టాండ్ ఎదుట నిలిచిన నీరు


దుర్గంధంగా మారిన ఎడపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్

టీజీ ఎడ్‌సెట్‌లో ఉషోదయ విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఉషోదయ కళాశాలకు చెందిన వేణుగోపాల్ అనే విద్యార్థి 2023 - 24 సంవత్సరంలో నిర్వహించిన పీజీ ఎడ్ సెట్ పోటి పరీక్షలో పాల్గొని రాష్ట్రస్థాయిలో 67వ ర్యాంకు సాధించారని ఉషోదయ కళాశాల డైరెక్టర్ దుష్యంత్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థి వేణుగోపాల్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం దుష్యంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిగ్రీ విద్యా ద్వారా ఉత్తమ విద్యా ప్రమాణాలు అందించి రాష్ట్రస్థాయిలో సత్తా చాటేలా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకులు హరికృష్ణ, నాగరాజ్, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

వర్షంతో హర్షం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వర్షం కురువడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజుల నుంచి వర్షం కురవకపోవడంతో రైతులు ఆకాశంవైపు చూశారు. మంగళవారం కురిసిన వర్షానికి కొంత ఉపశమనం పొందారు. మండలంలోని భూంపల్లి, కల్వరాల్, దగ్గి, పద్మాజివాడి, మల్లుపేట్, మోడేగాం, తిమ్మోజివాడి, తుక్కోజివాడి, లింగంపల్లి, సదాశివనగర్ తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

శాలివాహన సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో శాలివాహన కుమ్మరి సంఘం సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు సర్దన రమేష్ హాజరయ్యారు. అనంతరం ఈ సమావేశంలో కుమ్మరి శాలివాహన సంఘం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కుమ్మరి రాజు, ఉపాధ్యక్షులుగా కుమ్మరి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి రవి, కిషోర్, సహాయ కార్యదర్శిగా సాయిరాం, కోశాధికారి కుమ్మరి చిన్నఅంజయ్య, సలహాదారులుగా కుమ్మరి సాయిలు, కుమారి కాశీరాం, రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి కుమ్మరి సంఘం జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా తరగతులు

నవతెలంగాణ-ఎడపల్లి

అంగన్వాడి కేంద్రాల ఉపాధ్యాయులకు నూతన విద్య విధానంపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు బోధన్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ జానకి తెలిపారు. ఎడపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారానికి రెండో రోజుకు శిక్షణ తరగతులు చేరుకున్నాయి. అంగన్వాడి కేంద్రంలో మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాలలోపు బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్య చాలా ముఖ్యమైందన్నారు. అంగన్వాడి కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడి ఉపాధ్యాయులకు జాతీయ విద్యా విధానం కొత్త సిలబస్ చాలా దోహదపడుతుందన్నారు. ఇందులో తొమ్మిది అంశాలు ఉండగా 43 వారాలపాటు అంగన్వాడి కేంద్రాలకు వచ్చే బాలబాలికలకు విద్య బోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పూర్వ ప్రాథమిక విద్య నేర్చుకుంటేనే పిల్లలకు భవిష్యత్తు ఉంటుందన్నారు. అలాగే జాతీయ విద్యావిధానం అంశాలను పిల్లలకు నేర్పించాలన్నారు. శిక్షణ తరగతులు బుధవారంతో పూర్తవుతాయని వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ ఎడపల్లి మండల సూపర్వైజర్ విజయ రాణి, రెంజల్ మండల సూపర్‌వైజర్ ప్రమీల, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రాంబాబు, మాస్టర్ ఆసియా బేగం, రాధ, ఎడపల్లి రెంజల్ మండలాల అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు డీడీ చెల్లింపు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్, ఎల్లారెడ్డి గ్రామంలో విడిసి ఆధ్వర్యంలో హరిజనవాడ ప్రైమరీ స్కూల్ నుంచి గుండు రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు విద్యుత్ స్తంభాల కొరకు రూ.2,95,381 డిడిని విడిసి సభ్యులు చెల్లించారు. కార్యక్రమంలో చైర్మన్ నర్సింలు, క్యాషియర్ మహేందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ చక్రధర్‌గౌడ్, అశోక్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మతో కలిసి మొక్క నాటాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు 'ఏక్‌పేడ్ మా కా నామ్' (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా ప్రతీ బీజేపీ కార్యకర్త అమ్మతో కలిసి మొక్క నాటాలని, దానిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత అని యువత, మహిళలు, పెద్దలు అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే

పిఆర్టీయూ మండలాధ్యక్షులు బదిలీ

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని హంగర్గ గ్రామంలో 11 సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన పిఆర్టియు మండల అధ్యక్షులు సూదం వెంకటేష్ బోధన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన మండలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కాగా తనకు సహకరించిన ఎంఈఓ, కాంప్లెక్స్ హెడ్మాస్టర్, మండల ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే

నవతెలంగాణ-కామారెడ్డి

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా పలువురు డాక్టర్లను మంగళవారం సన్మానించారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పి.రాజనర్సింహరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి ఇన్‌చార్జి డిఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. డాక్టర్లు తమ విధుల పట్ల మరింత అంకితభావంతో పనిచేయాలని, తమ వృత్తి పట్ల మరింత గౌరవం పెంపొందించుకునే విధంగా పనిచేయాలని అన్నారు. విశిష్ట సేవలు అందించిన డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో గెస్ట్ ఆఫ్ హానర్‌గా ఎన్వి రమణ ఐఎంఏ ప్రెసిడెంట్, ప్రోగ్రాం చైర్మన్‌గా డాక్టర్ వెంకట రాజం, ఫాస్ట్ ప్రెసెంట్ పోలబోయిన సత్యం, కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

- గ్రామ ప్రత్యేకాధికారి గబ్బర్ సింగ్

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామాభివృద్ధే ధ్యేయమని గ్రామ ప్రత్యేకాధికారి గబ్బర్ సింగ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కుర్నాపల్లి గ్రామ ఎంపీటీసీ, ఎంపీటీసీల ఫోరం ఎడపల్లి మండలాధ్యక్షులు వెంకయ్య రామిరెడ్డిని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జూలై 4న ఎంపీటీసీగా ఆయన పదవీ కాలం ముగుస్తున్నందున గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆయనకు జ్ఞాపిక అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గబ్బర్‌సింగ్ మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులను మంజూరు చేయించి గ్రామ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఆయన కొనియాడారు.


ఎంపీటీసీని సన్మానిస్తున్న జీపీ సిబ్బంది

ఐదేళ్ల పదవీకాలం సంతృప్తినిచ్చింది..

ఎంపీటీసీల ఫోరం ఎడపల్లి మండల అధ్యక్షులు వెంకయ్యగారి రామిరెడ్డి మాట్లాడుతూ.. తనను గ్రామస్తులు ఆదరించి ఎంపీటీసీగా గెలిపించినందుకు ఐదేళ్ల ఎంపీటీసీ పదవీకాలంలో సంతృప్తినిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి గబ్బర్ సింగ్ తో పాటు ఇతర శాఖల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శి సిబ్బంది, అంగన్వాడీ ఉపాధ్యాయులు ఆశావర్కర్లు, గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించండి

నవతెలంగాణ-సదాశివనగర్/కామారెడ్డి

నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ గంగాసాగర్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమలంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు కృష్ణరావు, బీజేవైఎం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రేమ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు వంశీ, బీజేపీ టౌన్ అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, మోహన్ రాజు, సుశాంత్, రంజిత్ వేదాంత్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి..

కామారెడ్డి : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు, కామారెడ్డి జిల్లా కేంద్రంలో కళాశాల ముందు ఏబీవీపీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేసినట్టు జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి 11వేల ఉద్యోగాలు వేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రత్యూష, అల్తాఫ్, రాజు, బలరాం, మానస, రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

70 ఏండ్లవారికీ రైతు బీమా కల్పించాలి

- సొసైటీ చైర్మన్ కళ్యాణి

నవతెలంగాణ-నిజాంసాగర్


70 ఏండ్లవారికీ రైతు బీమా పథకం కల్పించాలని మల్లూరు సొసైటీ చైర్మన్ కళ్యాణి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మల్లూరు ఆధ్వర్యంలో వడ్డేపల్లి రైతు వేదికలో రైతు భరోసా పథకంపై రైతులతో అభిప్రాయ సేకరణ కోసం డిప్యూటీ రిజిస్ట్రార్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కళ్యాణి మాట్లాడుతూ.. రైతు చనిపోయే వరకు పొలం పని చేస్తాడని రైతు బీమా వయస్సు 70 సంవత్సరాల వరకు పెంచాలని ఆమె అధికారులకు అభిప్రాయం తెలిపింది. చాలామంది రైతులు 60 సంవత్సరాల పైబడిన వారేనని ఆమె అన్నారు. అనంతరం డిప్యూటీ రిజిస్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకే రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. వైస్ ఎంపీపీ మనోహర్ మాట్లాడుతూ.. భూమి ఎంత ఉన్న దానిని సాగు చేస్తే అంత భూమికి రైతుబంధు ఇవ్వాలని అన్నారు. అనంతరం మరణించిన రైతు కుటుంబాలకు జనత పాలసీ కింద మంజూరైన బీమా రూ.లక్ష చెక్కును బాధితులకు వారు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టర్ నర్సింలు, మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్, సొసైటీ సంఘ సిఈఓ సాయిలు, పాలకవర్గ సభ్యులు, నాయకులు విట్టల్‌రెడ్డి, ప్రజా పండారి, వెంకట్రాంరెడ్డి రైతులు పాల్గొన్నారు.


బీమా చెక్కును అందజేస్తున్న పలువురు

సమాజంలో బాలికల విద్య ప్రధానమైనది

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

సమాజంలో బాలికల విద్య ప్రధానమైనదని వక్తలు సూచించారు. మంగళవారం మండలంలోని అంబం (ఆర్) గ్రామ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు బాలికల విద్య ప్రాధాన్యతపై స్త్రీ శిశుసంక్షేమశాఖ నిజామాబాద్ టీం ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా టీం జనరల్ అవేర్‌నెస్ స్పెలిస్ట్ ఎం.కవిత మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్య మంచి భవిష్యత్తును ఇస్తుందన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే చదువు, సమాజం పరిస్థితులను శ్రద్దగా విని ఆ బాటలో నడవాలని తెలిపారు. అనంతరం భారతీయ న్యాయ సంహిత చట్టంపై, సమాజంలో బాలికల విద్య ప్రాధాన్యత, బాల్య వివాహాలు, సుకన్య సమృద్ధి యోజన, బాలిక విద్య, భేటీ బచావో భేటీ పడావో పలు అంశాలపై విస్తృతమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు భానుప్రియ, పుష్ప, స్వప్న, ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకుల బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎం.కవిత

ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

నవతెలంగాణ-బోధన్

ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని ఐదు సంవత్సరాలు ఎంపీటీసీలుగా, జెడ్పిటిసిలుగా వ్యవహరించి తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తనకు వెన్నంటి ఉండి రాజకీయాల్లో ప్రోత్సహించిన తన భర్త బుద్దె రాజేశ్వర్ లేని లోటు తీరనిదని అన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజాసేవే ధ్యేయంగా పేరు సాధించారని ఆయన ఆశయాలు కొనసాగిస్తామని అన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి శాఖల పనితీరుపై ప్రగతిని వివరించారు. ఎంపిటిసి, జడ్పిటిసిల పదవీకాలం ముగిసిన సందర్భంగా వారిని అధికారులు ఘనంగా సత్కరించారు. అనంతరం డిసిసిబి డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల కాలంలో ఎంపిటిసి, జడ్పిటిసిలుగా సేవలు మరువలేరని అన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులను సాధించి ప్రజాసేవలో నిలిచిపోవాలని ఆకాంక్షించారు. అందరికీ నాయకుడిగా, మంచి మనిషిగా పేరు సాధించిన బుద్దె రాజేశ్వర్ అకాల మరణం అందరికీ తీరని లోటని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, జడ్పిటిసి లక్ష్మి, డిసిసిబి డైరెక్టర్ శరత్, ఎంపిడీఓ వెంకటేష్ జాదవ్, మాజీ ఏఎంసి వైస్‌చైర్మన్ సాలూర షకీల్, పిఆర్‌టియూ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఇల్తెపు శంకర్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

4న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

- విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 4న ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. నీట్‌లో జరిగిన అవకతవకలపై ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వం ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ సామాన్య ప్రజలకు చదువును దూరం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై లేని ప్రేమ ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడి ఎటువంటి సౌకర్యాలు లేకున్నా ప్రైవేట్ పాఠశాలలకు పర్మిషన్ ఇస్తున్నారన్నారు. అలాగే విద్యార్థులకు స్కాలర్షిప్ ఇప్పటివరకు రాలేదని, ప్రభుత్వ పాఠశాలలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైందని అన్నారు. అన్ని సమస్యలపైన ఈ నెల 4న బంద్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, మేధావులు సంపూర్ణంగా మద్దతు తెలిపి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బర్ నాయక్, విజెఎస్ లక్ష్మణ్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం నీళ్ల నాగరాజు, నాయకులు జీవీఎస్ నాయకులు వినోద్, పిడిఎస్యు నాయకుడు పునీత్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

- మండలాధ్యక్షులు బసవరాజ్ పటేల్

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని డోంగ్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బసవరాజ్ పటేల్ తెలిపారు. మంగళవారం డోంగ్లీ మండలంలోని మొఘ గ్రామంలో జుక్కల్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంజూరు చేసిన రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డోంగ్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ శివాజీ పటేల్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సింగూరు జలాలను విడుదల చేయాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ ప్రాజెక్టుకు సింగూరు జలాలను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ప్రజాపండరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం మూడు టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందని ఆయన తెలిపారు. గత నెల 23వ తేదీన నిజాంసాగర్ ఆయకట్టు రైతుల విజ్ఞప్తి మేరకు ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. అధికారులు నిజాంసాగర్ నీటిని ప్రధాన కాలువ ద్వారా నారుమడులు వేసుకునేందుకు ఇప్పటివరకు ఒక్క టీఎంసీ వరకు నీటిని వదిలారని వివరించారు. దీనితో కేవలం 30 శాతం వరి నాట్లు మాత్రమే వేసినట్టు ఆయన తెలిపారు. నిజాంసాగర్ మొత్తం ఆయకట్టు లక్ష ముప్పై వేల ఎకరాలు ఉన్నదని, ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో కేవలం మూడు టీఎంసీల నిల్వ మాత్రమే ఉందని వివరించారు. అందువల్ల నిజాంసాగర్ ప్రాజెక్టుకు సింగూర్ జలాలను విడుదల చేస్తే ఆయకట్టు రైతులకు ఆసరాగా ఉంటుందని ఆయన తెలిపారు.